సాక్షి యాదాద్రి భువనగిరి

శనివారం, 29, జూలై, 2023



భువనగిరిలో దొంగల బీభత్సం
భువనగిరిలో గురువారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. నగదు, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. - 8లో



నడుద్దామన్నా నడవలేం
రామన్నపేట మండలంలోని కక్కిరేణి-మూండ్ర గ్రామాల మధ్య మట్టిరోడ్డు బురదమయంగా మారింది. - 9లో

గరిష్ఠం/కనిష్ఠం 29°/24°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్ దీపక్ తివారీ బదిలీ

సాక్షి, యాదాద్రి : స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ బదిలీ అయ్యారు. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీపక్ తివారీ జిల్లాలో ఇటీవలే రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్నారు. ఈయన స్థానంలో సీసీఎల్ఏలో స్పెషల్‌గేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న వీరారెడ్డి నియమితులయ్యారు. త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా శేఖర్‌రెడ్డి
భూ సేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా వి.శేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తహసీల్దార్‌గా ఉన్న శేఖర్‌రెడ్డి పదోన్నతిపై ఇక్కడి వచ్చారు. అదే విధంగా భువనగిరి తహసీల్దార్ కొప్పుల వెంకట్‌రెడ్డిని రంగారెడ్డి జిల్లా అర్బన్ సీలింగ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించింది.

ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరణ


నూతన ఆర్డీఓ కేఎంవీ జగన్నాథరావు

చౌటుప్పల్ : చౌటుప్పల్ నూతన ఆర్డీఓగా కేఎంవీ జగన్నాథరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆర్డీఓగా విధులు నిర్వహించిన కంచర్ల వెంకట ఉపేందర్‌రెడ్డి జీఏడీకి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఆర్డీఓ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా సంప్రదించవచ్చన్నారు.

వర్ష నష్టం అంచనా

సాక్షి, యాదాద్రి : వర్ష నష్టాన్ని అంచనా వేయడానికి ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖ అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ప్రధానంగా ఆత్మకూర్(ఎం), రాజాపేట, యాదగిరిగుట్ట, తుర్కపల్లి, గుండాల మండలాల పరిధిలో ఎక్కువగా నష్టం జరిగినట్లు గుర్తించారు. కలెక్టర్‌కు సమర్పించిన నివేదిక ప్రకారం 18 చోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. 152 ఇళ్లు కూలిపోగా 141 గృహాలు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. 20 వేల ఎకరాల్లో పత్తి, వరి చేలల్లో నీరు నిలిచి నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు.

శాలసిద్ధి వెబ్‌సైట్‌పై శిక్షణ


హెచ్‌ఎంలకు అవగాహన కల్పిస్తున్న డీఈఓ

భువనగిరి : శాలసిద్ధి వెబ్‌సైట్‌పై అవగాహన కల్పించేందుకు జిల్లాలోని ప్రధానోపాధ్యాయులకు భువనగిరిలోని వెన్నెల కళాశాలలో ఇస్తున్న శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణరెడ్డి హాజరై మాట్లాడారు. శాలసిద్ధి వెబ్‌సైట్‌లో పాఠశాల వివరాలను పొందుపర్చటం ద్వారా ఒక క్లిక్‌తో సులభంగా అన్ని విషయాలు తెలుసుకోవచ్చన్నారు. పాఠశాలకు సంబంధించిన వనరులు, అవసరాలు, వినిమోగం, అభ్యసన మదింపు, విద్యార్థుల ప్రగతి, సాధన, నాయకత్వం, సమ్మిళిత విద్య, ఆరోగ్యం వంటి 46 ఉప అంశాలు ఏడు కేటగిరీల్లో వెబ్‌సైట్‌లో పొందుపర్చవల్సి ఉంటుందన్నారు. ప్రధానోపాధ్యాయులు వెబ్‌సైట్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు శ్రీనివాస్, జోసెఫ్, నరహరి, పురుషోత్తంరెడ్డి, మురళీధర్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు లావాదేవీలపై అవగాహన అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్

చౌటుప్పల్ : బ్యాంకు లావాదేవీలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్ సూచించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం చౌటుప్పల్ మండల పరిధిలోని కొయ్యలగూడెం ఏపీజీవీబీలో ఖాతాదారులకు ఆర్థికపరమైన అంశాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక లావాదేవీల విషయంలో అవగాహన కలిగి ఉంటే ఎంతో పొదుపు జరుగుతుందని, లేనిపక్షంలో ఇబ్బందులు వస్తాయన్నారు. ఖతాదారుల కోసం బ్యాంకు ఆధ్వర్యంలో వివిధ రకాల సేవలందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీజినల్ అధికారి శ్రీనాయక్, బ్రాంచ్ మేనేజర్ సోమేశ్వర్‌రెడ్డి, జగదీష్, గ్రామసర్పంచ్ ఎల్లగిరి సర్పంచ్ ఇందిరమ్మ, ఉపసర్పంచ్ బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘శిథిల’ ముప్పు!

వర్షాలతో నానుతున్న పురాతన భవనాలు
- ఉమ్మడి జిల్లాలోని 19 మున్సిపాలిటీల్లో 241 ఇళ్ల గుర్తింపు
- యజమానులకు నోటీసులిచ్చి చేతులు దులుపుకున్న అధికారులు
- ఎప్పుడు కూలుతాయోనని ప్రజల ఆందోళన


యాదగిరిగుట్టలోని 1వ వార్డులో శిథిలావస్థకు చేరిన ఇల్లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : మున్సిపాలిటీల్లోని శిథిల భవనాలతో ముప్పు పొంచి ఉంది. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లోని శిథిల భవనాలు, ఇళ్లు నానిపోయి ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు కూలిపోతాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మున్సిపాలిటీల్లో శిథిల భవనలను గుర్తించిన అధికారులు కొన్ని చోట్ల కూల్చివేసినా, చాలాచోట్ల నోటీసులు ఇచ్చి వదిలేశారు. దీంతో కొన్ని కుటుంబాలు ఆ భవనాల్లోనే నివాసం ఉంటున్నాయి. వర్షాల కారణంగా అవి ఎప్పుడు కూలుతాయోనన్న భయంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. మరోవైపు పిల్లలు ఆడుకునేందుకు ఆ భవనాల వైపు వెళితే ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

గుర్తింపే.. కూల్చివేతలు ఏవీ?
ఉమ్మడి జిల్లాలోని 19 మున్సిపాలిటీల పరిధిలో అధికారులు 241 శిథిల భవనాలను గుర్తించారు. వర్షాలకు అవి కూలిపోయే ప్రమాదం ఉందని, వాటిల్లో నివాసం ఉండొద్దని సంబంధిత ఇంటి యజమానులకు నోటీసుల ఇచ్చారు. అయితే వాటి కూల్చివేత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు అంటున్నారు. వర్షాల ప్రారంభానికి ముందే అలాంటి భవనాలను గుర్తించి నోటీసులు జారీ చేసినా ఆ తర్వాత పట్టించుకోలేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

అధికారులు గుర్తించిన శిథిల భవనాలు ఇలా

మున్సిపాలిటీ	గుర్తించినవి	కూల్చినవి	మున్సిపాలిటీ	గుర్తించినవి	కూల్చినవి	మున్సిపాలిటీ	గుర్తించినవి	కూల్చినవి
దేవరకొండ	21	0	తిరుమలగిరి	6	0	భూదాన్‌పోచంపల్లి	4	0
మిర్యాలగూడ	21	5	సూర్యాపేట	16	4	నేరేడుచర్ల	3	0
హాలియా	9	0	చండూరు	40	28	నకిరేకల్	20	0
చౌటుప్పల్	16	0	చిట్యాల	8	0	నల్లగొండ	23	12
మోత్కూర్	9	0	కోదాడ	6	1	నాగార్జునసాగర్	0	0
హుజూర్‌నగర్	5	2	ఆలేరు	8	1	భువనగిరి	27	9
			యాదగిరిగుట్ట	19	5	మొత్తం	241	67

మీరే కూల్చేసుకోండి..
జిల్లాలోని కొన్ని మున్సిపాలిటీల్లో మాత్రమే అధికారులు శిథిల భవనాలను కూల్చివేశారు. చాలా చోట్ల అసలు పట్టించుకోలేదు. దేవరకొండలో కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని చెబుతుండగా అత్యధిక మున్సిపాలిటీల్లో మాత్రం మీరే కూల్చేసుకోవాలని ఇళ్ల యజమానులకు చెప్పి చేతులు దులుపుకున్నారు. దీంతో కొందరు యజమానులు శిథిల భవనాల్లోనే నివాసం ఉండేందుకు వాటికి మరమ్మతు చేయించుకుంటున్నారు. అధికారులు మాత్రం శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివాసం ఉండొద్దని గోడలపై రాసి చేతులు దులుపుకున్నారు. వర్షాలు భారీగా వస్తుండడంతో తిరుమలగిరి, మోత్కూరు, హుజూర్‌నగర్ మున్సిపాలిటీల్లో శిథిల భవనాల్లో నివాసం ఉంటున్న వారిని వారి బంధువుల ఇళ్లకు, కమ్యూనిటీ హాళ్లలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. ఇక, నకిరేకల్ మున్సిపాలిటీల్లో ఇంతవరకు నోటీసులు కూడా జారీ చేయలేదు.


మోత్కూరులో శిథిలావస్థకు చేరిన ఇంటిని పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు


అలుగుపోస్తున్న తుర్కపల్లి మండలంలోని గంధమల్ల చెరువు

కొనసాగుతున్న వరద ఉధృతి

- ఎగువనుంచి తగ్గని నీటి ప్రవాహం
- పరవళ్లు తొక్కుతున్న బిక్కేరు, మూసీ
- కాజ్‌వేలపైనుంచి రాకపోకలు బంద్
- అలుగుపోస్తున్న గంధమల్ల చెరువు


ఆత్మకూరు(ఎం) మండలం ఉప్పలపహాడ్ పరిధిలో బిక్కేరు వద్ద ఏర్పాటు చేసిన గేట్

సాక్షి నెట్‌వర్క్ : వాగులకు వరద ఉధృతి కొనసాగుతోంది. జిల్లాలో వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికీ ఎగువనుంచి వస్తున్న వరదతో వాగులు పరవళ్లు తొక్కుతున్నాయి. ఆత్మకూరు(ఎం) మండల పరిధిలోని బిక్కేరు కాజ్‌వేపైనుంచి బిక్కేరు వాగు ప్రవహిస్తుండడంతో రెండో రోజు శుక్రవారం రాకపోకలు నిలిచిపోయాయి. భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్ మండలాల పరిధిలోని జూలూరు – రుద్రవెల్లి మధ్య ఉన్న లో లెవల్ బ్రిడ్జిపై నుంచి మూసీ ఉధృతి కొనసాగింది. దీంతో ఈ మార్గంలో నాలుగో రోజు రాకపోకలు నిలిపివేశారు. గత్యంతరం లేక ప్రజలు పెద్దరావులపల్లి మీదుగా భువనగిరికి వెళ్తున్నారు. అదే విధంగా జిల్లాలోనే అతి పెద్దదైన తుర్కపల్లి మండలంలోని గంధమల్ల చెరువు నిండి అలుగుపోస్తోంది. అలుగునుంచి నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో పోలీసులు ముందస్తు జాగ్రత్తంగా గంధమల్ల నుంచి వీరారెడ్డిపల్లి రోడ్డుపై కంప మండలు ఏర్పాటు చేసిన ప్రజలు అటువైపు వెళ్లకుండా అప్రమత్తం చేశారు. రాజాపేట మండలంలోని బేగంపేట వాగు ఉధృతికి రోడ్డుపై కల్వర్టు కొట్టుకుపోయింది.

నాలుగు ఎకరాలు నీట మునిగింది



బునాదిగాని కాల్వ కట్ట తెగడంతో నాలుగు ఎకరాలు వరి పొలం పూర్తిగా నీట మునిగింది. వెంటనే కాల్వకు మరమతులు చే యాలి. పూర్తిస్థాయిలో నిర్మాణం చేయాలి.
–వేముల రాజు, రైతు, పోసానికుంట

బునాదిగాని కాల్వకు గండి
ఆత్మకూరు(ఎం) మండలం పోసానికుంట వద్ద బునాదిగాని కాల్వ కట్ట తెగడంతో సుమారు 20 ఎకరాల్లో పొలాలు నీట మునిగాయి. అధికారులు కాల్వను పరిశీలించారు. కల్వర్టు నిర్మాణ స్థలం పైభాగంలో కాల్వ పనులు అసంపూర్తిగా ఉండడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని బాధిత రైతులు వాపోయారు. బీబీనగర్ మండలం రాఘవాపురం వద్ద బునాదిగాని కాల్వకు గండి పడి నివాసాల మధ్య నీరు చేరింది.


కాల్వ కట్ట తెగడంతో పొలాల్లోకి వెళ్తున్న నీరు


రాజాపేట మండలంలో బేగంపేట వాగు ఉధృతికి కొట్టుకుపోయిన కల్వర్టు

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

- పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

భువనగిరిటౌన్ : సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ టీఎస్‌సీపీఎస్ఈ ఆధ్వర్యంలో చేపట్టిన పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర శుక్రవారం భువనగిరికి చేరుకుంది. ఈ సందర్భంగా రహదారి బంగ్లా నుంచి కలెక్టరేట్ వరకు ఉద్యోగులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. ఇప్పటికే రాజస్థాన్, చత్తీష్‌గఢ్, జార్ఖండ్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో సీపీఎస్‌ను రద్దు చేశాయన్నారు. ఉద్యోగుల పక్షపాతిగా చెప్పుకుంటున్న తెలంగాణ ప్రభుత్వం కూడా ఎన్నికలకు ముందే సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. ఆగస్టు 12న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు సిద్దగోని వెంకటరమణ మాట్లాడుతూ సీపీఎస్ విధానం తీసుకురావడం వల్ల దాదాపు 2 లక్షల ఉద్యోగులు, ఉపాధ్యాయులు అభద్రతా భావంతో ఉన్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌సీపీఎస్ఈ రాష్ట్ర కార్యదర్శి కల్లల శ్రీకాంత్, కోశాధికారి నరేష్, రాష్ట్ర బాధ్యులు పవన్, వెంకటేశ్, నాగరాజు, మల్లికార్జున్, జిల్లా కార్యదర్శి రవి, సహాధ్యార్థులు విష్ణు, ప్రదీప్, రాం మోహన్, నర్సింహ, సునీల్, వెరుచ్చెండి, కోశాధికారి నాగిల్లి రవీందర్, అశోక్, నరేష్ పాల్గొన్నారు.

పత్తి చేలలో నీటిని తొలగించాలి

యాదగిరిగుట్ట రూరల్ : వర్షాలకు పత్తి చేలలో చేరిన నీటిని వెంటనే తొలగించాలని జిల్లా వ్యవసాయ అధికారి(డీఏఓ) అనురాధ సూచించారు. యాదగిరిగుట్ట మండలం సాధువెల్లి గ్రామంలో వరి, పత్తి చేలను శుక్రవారం ఆమె పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. అధిక వర్షాల వల్ల పత్తికి తెగుళ్లు సోకే ప్రమాదం ఉందని, వెంటనే నీటిని తొలగించాలన్నారు. వేరుకుళ్లు తెగులు సోకకుండా సీఓసీ 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పంట చేలకు ఎలాంటి తెగుళ్లు సోకినా వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. అదే విధంగా రైతుబీమా కోసం ఆగస్టు 5వతేదీ వరకు గడువు ఉందని, దరఖాస్తు చేసుకోని వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి రాజేష్‌కుమార్, ఏఈఓ మనోజ్‌కుమార్, సర్పంచ్ మీస సత్యలక్ష్మి, రైతులు బాలరాజు, శ్రీరాములు, శ్రీను ఉన్నారు.

మూసీ ప్రక్షాళనకు కేటీఆర్ హామీ

- కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి


కుమారుడు శ్రీరాంరెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి : మూసీ ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని బీఆర్ఎస్ నాయకుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. మూసీ ప్రక్షాళన చేయాలని కోరడంతో మంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు. 2,000 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్స్ ఫర్ డే)ల మూసీ నీటిని శుద్ధి చేయడానికి రూ.4 వేల కోట్లతో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. వ్యవసాయం, ఇతర అవసరాలకు కాలుష్యం లేని నీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటుందని వివరించారు. మూసీ ప్రక్షాళన కోసం ప్రభుత్వం నిధులు ఖర్చు చేస్తుందని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం స్థానిక ఎమ్మెల్యేతో కలిసి పనిచేయాలని సూచించినట్లు పేర్కొన్నారు. వలిగొండకు చెందిన ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరినట్లు కుంభం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వద్ద రాష్ట్ర అభివృద్ధికి ఎలాంటి విజన్ లేదని, పార్టీలో ఉన్న వారిని అణగదొక్కడానికే పాటుపడుతారు తప్ప మరో ఆలోచన ఆ పార్టీ నాయకుల్లో లేదన్నారు. కేసీఆర్, కేటీఆర్‌ల విజన్ ప్రకారం తెలంగాణ అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు.

కుంభం సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక


బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారితో అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు సుమారు 250 మంది శుక్రవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లోకి వస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి భారీ చేరికలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్, సర్పంచ్ బోళ్ల లలితాశ్రీనివాస్, వైస్ ఎంపీపీ భాతరాజు ఉమాబాల్‌నర్సింహ, పసల జ్యోతివిజయానంద్, కుందారపు యశోద కోమురయ్య, యడవెల్లి సత్తమ్మ యాదయ్య, నీలం లలితా బాబురావు, కుంభం వెంకటపాపిరెడ్డి, గరిసె రవి, పల్లెర్ల జానకిరాం, కనకాల కిష్టయ్య, బత్తిని పాండు పాల్గొన్నారు.

లోటు భర్తీ చేసేలా!

- చేరికలపై కాంగ్రెస్ దృష్టి
- అనిల్‌రెడ్డి వెంట ఎవరూ వెళ్లకుండా కట్టడికి వ్యూహం
- అయినా గులాబీ కండువా కప్పుకునేందుకు మరికొందరు సిద్ధం
- రెండు పార్టీల్లో పోటాపోటీగా ప్రయత్నాలు


జిట్టా బాలకృష్ణారెడ్డి


చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: కుంభం అనిల్ కుమార్‌రెడ్డి పార్టీని వీడిన నేపథ్యంలో ఆ లోటును పూడ్చడానికి కాంగ్రెస్ నాయకత్వం దృష్టి సారించింది. కుంభం వెంట ఎవరూ వెళ్లకుండా చూడడంతో పాటు ఇతర పార్టీలోని అసంతృప్తులపై హస్తం పార్టీ కన్నేసింది. నియోజకవర్గంలో బలమైన అనుచరగణం కలిగి ఉన్న జిట్టా బాలకృష్ణారెడ్డి, చింతల వెంకటేశ్వర్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇప్పటికే తమ అనుచరులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారి అభిప్రాయం కూడా తీసుకున్నారు. కాంగ్రెస్ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే కండువా మార్చేందుకు సిద్ధంగా ఉన్నారు. మరోవైపు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తన పట్టు నిలుపుకోవడానికి కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలను ప్రోత్సహిస్తున్నారు.

బీఆర్ఎస్‌కు ‘చింతల’ రాం..రాం?
తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకోవడానికి తనకు అవకాశం వచ్చిందని సీనియర్ నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమయ్యారు. కాంగ్రెస్‌తో ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని వీడి తొమ్మిదేళ్ల క్రితం బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్సీ పదవి వస్తుందన్న ఆశలు నెరవేరలేదు. తనకు బీఆర్ఎస్ పార్టీ సరిగా గుర్తింపు ఇవ్వడం లేదని ఇటీవల ఆయన వ్యాఖ్యానించారు. భువనగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో ఆయనకంటూ ఉన్న వర్గం చింతల నిర్ణయాన్ని స్వాగతిస్తోంది. 2000 సంవత్సరంలో భువనగిరి ఎమ్మెల్యే, అప్పటి మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి మరణానంతరం వచ్చిన అసెంబ్లీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ నుంచి చింతల వెంకటేశ్వర్‌రెడ్డి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం 2009లో భువనగిరి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా రెండవసారి పోటీ చేసినప్పటికీ విజయం వరించలేదు. అయితే 2014లో మారిన రాజకీయ పరిస్థితులతో కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో మరోసారి భువనగిరి నుంచి ఎమ్మెల్యేగా రానున్న ఎన్నికల్లో పోటీ చేయడానికి ఉవ్విళ్లూరుతున్నారు. ఆయన త్వరలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారని ప్రచారం జోరందుకుంది.

కాంగ్రెస్ వైపు జిట్టా చూపు : బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ఉన్న జిట్టా బాలకృష్ణారెడ్డిని ఆ పార్టీ సస్పెండ్ చేయడంతో ఆయన కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయాలని భావిస్తున్నారు. యువజన సంఘాల నాయకునిగా తెలంగాణ ఉద్యమ నేతగా పేరున్న జిట్టా బాలకృష్ణారెడ్డి 2009లో బీఆర్ఎస్‌నుంచి భువనగిరి ఎమ్మెల్యేగా పోటీ చేయాలనుకున్నారు. మహాకూటమి పొత్తులో ఆయనకు టికెట్‌రాలేదు. దీంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేశారు. 2014లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసినప్పటికి ఓటమి తప్పలేదు. 2018లో బీజేపీ మద్దతుతో యువ తెలంగాణ అభ్యర్థిగా రంగంలోకి దిగినా ప్రయోజనం దక్కలేదు. అయితే నియోజకవర్గ వ్యాప్తంగా తనకంటూ అనుచర గణం కలిగిన జిట్టా మరో సారి భువనగిరిలో పోటీకి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని తన అనుచరుల అభిప్రాయాలను తీసుకుంటున్నారు. కాంగ్రెస్ అధిష్టానం కూడా జిట్టా బాలకృష్ణారెడ్డిని పార్టీలో చేర్చుకునే విషయంపై సానుకూలంగా ఉన్నట్లు సమాచారం.

బీఆర్ఎస్‌లోకి ద్వితీయ శ్రేణి
కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరడంతో ద్వితీయ శ్రేణి ఆయన బాటలో పయనిస్తోంది. గురువారం భువనగిరి మున్సిపల్ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీకి చెందిన పచ్చలహేమలత ఆ పార్టీకి రాజీనామా చేశారు. మరో నలుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరడానికి సిద్ధంగా ఉన్నారని సమాచారం. వలిగొండకు చెందిన కాంగ్రెస్ ఎంపీటీసీ సభ్యులు శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. నియోజకవర్గంలోని మరికొన్ని మండలాల నుంచి ద్వితీయ శ్రేణి క్యాడర్ బీఆర్ఎస్‌లో చేరడానికి సిద్ధం అవుతున్నారు.

ఆండాళ్ అమ్మవారికి ఊంజలి సేవ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం సాయంత్రం ఊంజలి సేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మాఢ, తిరువీధిలో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో అధిష్టింపజేసి ఊంజలి సేవ జరిపించారు. మహిళలు మంగళ హారతులతో సేవకు స్వాగతం పలికారు. ఇక ప్రధానాలయంలో నిత్య కైంకర్యాలు కొనసాగాయి. వేకువజామున స్వామివారికి సుప్రభాత సేవ, అర్చనలు, అభిషేకం చేశారు. అనంతరం ముఖమండపం, ప్రాకార మండపాల్లో శ్రీసుదర్శన నారసింహహోం, నిత్యకల్యాణం, జోడు సేవలు తదితర కైంకర్యాలు గావించారు. భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.


ఆండాళ్‌దేవికి హారతినిస్తున్న ఆచార్యులు

క్లుప్తంగా

30న చెస్ సెలక్షన్స్

సూర్యాపేట టౌన్: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కిరాణా మర్చంట్స్ భవనంలో ఈనెల 30న సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి చెస్ 2023 అఫీషియల్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గందూరి కృపాకర్, ఎల్.సతీష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–11, అండర్–19 బాలబాలికలకు సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఆదివారం ఉదయం 10గంటల లోపు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారిని హైదరాబాద్‌లో జరిగే స్టేట్ సెలక్షన్స్‌కు పంపించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి నల్లగొండ జిల్లా చెస్ క్రీడాకారులు సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 85550 08996, 93947 53343లను సంప్రదించాలన్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా



జలాల్‌పురం వద్ద బోల్తా పడిన లారీ

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జలాల్‌పురం గ్రామశివారులో శుక్రవారం ఉదయం అతివేగంతో పోచంపల్లి వైపు వస్తున్న ఇటుకల లారీ అదుపుతప్పి బోల్తా పడింది. రోడ్డు పక్కనే ఉన్న పొలంలో దూసుకెళ్లింది. ప్రమాదంలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య



నవీన్ మృతదేహం

నల్లగొండ క్రైం : పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాలపడ్డాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన గద్దం నవీన్(25)కు భార్య, కూతురు ఉంది. నవీన్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నవీన్ మద్యానికి బానిసగా మారడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన నవీన్ శుక్రవారం భార్య ఓంకారేశ్వరి కూతురిని తీసుకుని బయటికి వెళ్లిన సమయంలో పురుగుల మందు తాగాడు. ఓంకారేశ్వరి ఇంటికి తిరిగి వచ్చేసరికి పక్కనే పురుగుల మందు డబ్బా, అపస్మారక స్థితిలో నవీన్ పడి ఉండడంతో లబోదిబోమంది. స్థానికుల సహాయంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టు టౌన్ ఎస్‌ఐ సైదులు తెలిపారు.

భువనగిరిలో దొంగల బీభత్సం



జహంగీర్ ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు



బాధితులతో మాట్లాడుతున్న సీఐ సుధీర్ కృష్ణ

- తాళాలు వేసిన ఐదు ఇళ్లలో చోరీ
- తొమ్మిది తులాల బంగారం, రూ.3.25 లక్షల నగదు అపహరణ

భువనగిరి : గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి భువనగిరి పట్టణంలో బీభత్సం సృష్టించారు. తాళాలు వేసిన ఐదు ఇళ్లలోకి చొరబడి బంగారు ఆభరణాలతో పాటు రూ.3.25లక్షలను చోరీ చేశారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపురం గ్రామానికి చెందిన పాముల జహంగీర్ ఆరు నెలల నుంచి పట్టణంలోని పోచమ్మవాడలో అద్దె ఇంట్లో ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. పీర్ల పండుగ సందర్భంగా భార్యతో కలిసి గురువారం స్వగ్రామానికి వెళ్లారు. యాజమాని ఉదయం వచ్చి చూడగా ఇంటి తాళం తీసి ఉన్నట్లు గమనించి వెంటనే జహంగీర్‌కు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న వారు ఇంటికి చేరుకున్నారు. ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడేయడంతో పాటు ల్యాప్‌టాప్, రూ.25వేల నగదు, తులం బంగారు గొలుసు అపరణకు గురైనట్లు గుర్తించారు.

ఎల్బీనగర్‌లో..

భువనగిరి పట్టణంలోని ఎల్బీనగర్‌కు చెందిన సిద్దంటి నిర్మల బోనాల పండుగను పురస్కరించుకుని ఉప్పల్‌లో ఉంటున్న బంధువుల ఇంటికి ఇటీవల కుమారుడు కరుణాకర్‌తో కలిసి వెళ్లింది. తిరిగి శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చారు. అప్పటికే తాళం తీసి ఉన్నట్లు గమనించి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి వస్తువులు చిందరవందరగా పడవేశారు. అందులోని ఆరు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. అదేవిధంగా ఉప్పల్‌లో జరిగిన బోనాల పండుగకు వెళ్లిన ఇందిరానగర్‌లోని పొట్ట పుష్ప ఇంట్లో తులన్నర బంగారం, రూ.2 లక్షల నగదు, భూషపాక సావిత్రి ఇంట్లో రూ.లక్ష నగదు, పల్లెర్ల ఆరాధన ఇంట్లో గ్యాస్ సిలిండర్ అపహరణకు గురైనట్లు బాధితులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సుధీర్ కృష్ణ ఘటనా స్థలాలను పరిశీలించారు. పోచమ్మవాడలో సీసీ ఫుటేజీని పరిశీలించగా గురువారం రాత్రి 12గంటలకు ఓ వ్యక్తి చోరీ జరిగిన ఇంటి వైపు వెళ్లి తిరిగి 2గంటల తర్వాత అదే ప్రాంతం నుంచి వెళ్తున్నట్లుగా గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మందులవారి కాలనీలో భారీ చోరీ

- 16 తులాల బంగారం, 15తులాల వెండి అపహరణ

మిర్యాలగూడ అర్బన్: ఇంట్లో మనుషులు ఉండగానే చడీ చప్పుడు కాకుండా లోనికి దూరిన దుండగులు బంగారు, వెండి ఆభరణాలను అపహరించుకుపోయారు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని ముత్తిరెరెడ్డికుంట మందులవారి కాలనీలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మందుల వారి కాలనీలో నివాసముంటున్న షేక్ రబియాబి కుటుంబ సభ్యులు గురువారం రాత్రి వేర్వేరు గదుల్లో నిద్రపోయారు. అర్ధరాత్రి తర్వాత మెయిన్ డోర్ పక్కన కిటికీ గుండా దుండగులు డోరు బేడం తెరిచారు. అనంతరం ఇంట్లోకి ప్రవేశించి మరో బెడ్ రూంలో ఉన్న సూట్‌కేస్ తెరిచి చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం లేచి చూసిన వారికి ఇంటి తలుపులతో పాటు బెడ్‌రూంలోని సూట్‌కేస్ తెరిచి ఉండటంతో చోరీ జరిగిందని భావించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వన్‌టౌన్ సీఐ రాఘవేందర్ వివరాలు తెలుసుకున్నారు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ఈ గఘటనలో 16 తులాల బంగారు ఆభరణాలతో పాటు 15తులాల వెండి చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

అంతరిస్తున్న ఆదిమానవుల ఆనవాళ్లు

- సీనియర్ రీసెర్చ్ స్కాలర్ పంబాల పర్వతాలు



పర్వతాలు

చందంపేట : ఆదిమానవుల ఆనవాళ్లు అంతరిస్తున్నాయని హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయానికి చెందిన సీనియర్ రీసెర్చ్ స్కాలర్ పంబాల పర్వతాలు పేర్కొన్నారు. తన పరిశోధనలో భాగంగా నేరెడుగొమ్ము మండలంలోని పెద్దమునిగల్ గ్రామ సమీపంలో శుక్రవారం ఆదిమానవుల సమాధులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ సమాధులు రాతి యుగానికి చెందినవని, వేటని జీవనాధారంగా చేసుకొని జీవించిన మనిషి నది ప్రవాహక ప్రాంతాన్ని అనువుగా చేసుకొని వ్యవసాయ జీవితానికి అలవాటు పడిన కాలంటిదిగా గుర్తించారు. ఇవి దాదాపు పదివేల మెగాలిథిక్ కాలం నాటికి సంబంధించినవి కావచ్చని, సంచార జీవితం గడుపుతూ వ్యవసాయానికి అలవాటు పడి శాశ్వతంగా గ్రామాల్లో స్థిరపడడం ఈ కాలం నుంచి ప్రారంభమైందన్నారు. ఇలాంటి ప్రాచీనమైన మానవ సమాధులు నేడు అవగాహన కొరవడి కొంత మంది వాటిని తొలగిస్తున్నారని, ఇంకొంత మంది గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్థానికులతో చర్చించి వారికి అవగాహన కల్పించాలని, సమాధుల ఆనవాళ్లు పురావస్తు శాఖకు అందించి వాటిని భద్రపర్చాలని సూచించారు.



ఆదిమానవుల కాలం నాటి సమాధులు

ఆలయానికి వెండి కవచం, గడప బహూకరణ



దాతలు బహూకరించిన వెండి కవచం

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి సికింద్రాబాద్‌లోని శేరుపల్లి జువెలర్స్‌కు చెందిన శ్రీనివాస్ రజిత 499గ్రాముల వెండి గడప, 2కిలోల 34గ్రాముల వెండి కవచాన్ని బహూకరించారు. శుక్రవారం శ్రీస్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆండాళ్ దేవికి ఇష్టమైన రోజు కావడంతో 2కిలోల 34గ్రాముల వెండితో తయారు చేసిన కవచాన్ని, 499గ్రాముల వెండి గడపను ఈఓ గీతారెడ్డికి అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ గీతారెడ్డి లడ్డూ ప్రసాదం అందజేశారు.

'పులిచింతల'కు పెరుగుతున్న ఇన్‌ఫ్లో

హుజూర్‌నగర్: పులిచింతల పాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో మరింత పెరిగింది. ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో శుక్రవారం 56,227 క్యూసెక్కులుగా నమోదైంది. జిల్లాలో కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి కృష్ణా నదిలో కలుస్తున్నాయి. దీంతో పాటు మూసీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయడంతో ఆ నీరు కూడా వచ్చి చేరడంతో వరద ఉధృతి మరింత పెరిగింది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 28.63 టీఎంసీల నీరు ఉంది. పూర్తిస్థాయి నీటి మట్టం 175 అడుగులు కాగా ప్రస్తుతం 162 అడుగుల మేర నీరు ఉంది. లీకేజీల ద్వారా 200 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తోంది.

ఎన్టీసీఏ అవార్డుకు కంబాలపల్లి బీట్ ఆఫీసర్



ఎ.కవిత

చందంపేట, నాగార్జున సాగర్ : కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్టీసీఏ) ఎంపిక చేసిన కేంద్ర అవార్డుకు చందంపేట మండలం కంబాలపల్లి బీట్ ఆఫీసర్ ఎ.కవిత ఎంపికైనట్లు డీఎఫ్ఓ సర్వేశ్వర్ తెలిపారు. గ్లోబల్ టైగర్ డే సందర్భంగా ఈ నెల 29న ఉత్తరాఖండ్‌లో కేంద్ర పర్యావరణ మంత్రి చేతుల మీదుగా కవిత అవార్డును అందుకోనున్నారు. మొదటిసారిగా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఈ అవార్డుకు కవిత ఎంపిక కావడం విశేషం.

ఊరు చీకట్లో మగ్గుతోందని..

- చెరువును తలపించేలా నీరున్నా విద్యుత్ స్తంభం ఎక్కి..
- మరమ్మతులు చేసి విద్యుత్ సమస్యను తీర్చిన యువకుడు
- సంతోష్‌గౌడ్ సాహసాన్ని అభినందించిన మంత్రి జగదీశ్‌రెడ్డి



పాతర్లపహాడ్‌లో స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తున్న సంతోష్‌గౌడ్



సంతోష్‌గౌడ్

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : అసలే ఎడతెరిపి లేని వర్షాలు, ఆపై చెరువును తలపించేలా చుట్టూ నీరు.. దీనికి తోడు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఊరు ఊరంతా చికట్లో మగ్గిపోతోంది. దీనిని చూడలేని ఓ యువకుడు తన ప్రాణాలను ఫణంగా పెట్టి సాహసం చేశాడు. నీటిలో ఈదుకుంటూ వెళ్లి.. విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేసి విద్యుస్ సమస్యను తీర్చాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన కొప్పుల సంతోష్ గౌడ్ స్థానిక లైన్‌మన్ కింద హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. దీనికి తోడు గ్రామానికి పైభాగంలో ఉన్న అయ్యవారికుంట తండా చెరువు నుంచి శంభుని చెరువుకి వచ్చే కరకట్ట తెగిపోయింది. ఈ వరదంతా పాతర్లపహాడ్‌లోని ముదిరాజ్ కాలనీని ముంచెత్తింది. దీంతో గురువారం రాత్రి నుంచి గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీన్ని సరిచేయాలని ప్రయత్నించగా చెరువును తలపించేలా చుట్టూ వరద నీరు ఉన్న ఓ స్తంభంపై సమస్య ఉందని గుర్తించారు. ఈ స్తంభంపై మరమ్మతులు చేస్తేనే గ్రామానికి విద్యుత్ సరఫరా అవుతుందని, లేదంటే చీకట్లోనే గడపాల్సి ఉందని భావించారు. విధి నిర్వహణలో భాగంగా అక్కడే ఉన్న విద్యుత్ హెల్పర్ సంతోష్ గౌడ్ వరదను లెక్కచేయకుండా దిగాడు. చాలా దూరం ఈదుకుంటూ వెళ్లి స్తంభం ఎక్కి మరమ్మతులు పూర్తి చేసి క్షేమంగా తిరిగి వచ్చాడు. సంతోష్ గౌడ్ చేసిన సాహసానికి గ్రామ ప్రజలే కాకుండా రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి కూడా ట్విట్టర్ ద్వారా అభినందనలు తెలిపారు.

మార్కెట్‌లోకి రోనిన్ బైక్



కొత్త బైక్‌ను నడుపుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని డీవీకే రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వీ టీవీఎస్ షోరూంను శుక్రవారం మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రారంభించారు. అత్యాధునిక టెక్నాలజీ, అత్యధిక మైలేజీ ఇచ్చే టీవీఎస్ ప్రీమియం బ్రాండ్ రోనిన్ బైక్‌ను రంగారెడ్డి మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన కాసేపు బైక్ నడిపి యువతలో హుషారెత్తించారు. కార్యక్రమంలో షోరూం ఎండి. చైతన్యరెడ్డి, జీఎం వసంత్‌కుమార్, ఎస్ఎం సాంబయ్య, సాగర్ రెడ్డి, సాంబిరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిని ఓర్వలేక ఆరోపణలు



వంగపల్లిలో డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద మాట్లాడుతున్న లబ్ధిదారులు

యాదగిరిగుట్ట రూరల్ : నియోజకవర్గంలో ఎమ్మెల్యే సునీత చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేక నిరాధార ఆరోపణలు చేస్తున్నారని డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులు, ఉప సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు రేపాక స్వామి అన్నారు. యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లిలో డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. వంగపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను కార్డు ఉన్న వారికి కేటాయించారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కానుగు బాలరాజ్‌గౌడ్ చేసిన వ్యాఖ్యలు అవాస్తవం అన్నారు. ప్రకృతి వైపరీత్యాలకు డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద నీరు నిలిస్తే దాన్ని కాంగ్రెస్ నాయకులు రాజకీయం చేయడం తగదన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి స్థలం కేటాయించే సమయంలో గ్రామ సర్పంచ్ భర్త కానుగు బాలరాజ్ గౌడ్ తహసీల్దార్‌కు చూపించి, శంకుస్థాపనకు కొబ్బరికాయలు కొట్టి ఆయనే మళ్లీ ఇప్పుడు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇళ్ల పక్కన కాల్వ సరిగా లేకపోవడంతో నీళ్లు వస్తున్నాయని, దాన్ని సరిచేస్తే సమస్య ఉండదని, అందుకు ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వంగపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు అచ్చిన క్రిష్ణస్వామి, మండల యూత్ అధ్యక్షుడు ఎండీ అజ్జు, నాయకులు సీస శేఖర్, లబ్ధిదారులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన నలుగురికి జరిమానా

రామగిరి(నల్లగొండ): కులం పేరుతో దూషించన నలుగురు వ్యక్తులకు జరిమానా విధిస్తూ ఎస్సీ ఎస్టీ కోర్టు ఇంచార్జి జడ్జి బి.తిరుపతి శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... చిట్యాల మండలం వెలిమినేడుకు చెందిన బక్క శేఖర్ 2018 నవంబర్ 17న రాత్రి చౌటుప్పల్ మండలం లక్కారం చర్చి నుంచి వెళ్తున్న సమయంలో సమీపంలోని బ్రిడ్జి వద్ద కొంత మంది వాల్ పోస్టర్ అంటిస్తున్నారు. హిందూ వాహిని సంస్థకు చెందిన కానుగు వెంకటేశం, దొమ్మాటి రాజశేఖర్, రాచకొండ శ్రీధరచారి, కానుగు సాయి కుమార్‌లు శేఖర్‌ను అడ్డుకున్నారు. ఎందుకు అడ్డుకుంటున్నారని బక్క శేఖర్ వారిని ప్రశ్నించడంతో వారందరూ కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారు. వారి నుంచి తప్పించుకొని బాధితుడు చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఏసీపీ వి.బాపురెడ్డి, సీఐ పి.వెంకటేశ్వర్లు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.శ్రీనివాస్ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి బి.తిరుపతి సెక్షన్ 323 కింద నలుగురు నిందితులు ఒక్కొక్కరికి రూ. వెయ్యి జరిమానా, చెల్లించని పక్షంలో నెల రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు.